క్లుప్తంగా

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

పాకాల : వివిధ కార్పొరేషన్ల కింద మంజూరు చేస్తున్న సబ్సిడీ రుణాలకు సంబంధించి మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ అరుణ మాట్లాడుతూ రుణాలకు సుమారు 511 మంది దరఖాస్తు చేసుకోగా 392 మందికి ఇంటర్వ్యూలు పూర్తి చేసినట్లు తెలిపారు. అర్హులను బ్యాంకర్లు ఎంపిక చేసి రాయితీపై రుణాలు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.

గ్రావెల్ తరలింపునకు చెక్

సాక్షి ఎఫెక్ట్..

చంద్రగిరి : మండలంలో గ్రావెల్ అక్రమ తరలింపునకు రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం చెక్ పెట్టారు. మండపంపల్లె నుంచి యథేచ్ఛగా సాగుతున్న గ్రావెల్ తరలింపుపై సాక్షి పత్రికలో మంగళవారం బరితెగింపు శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే మండపంపల్లె వద్ద మట్టి తవ్వకం జరుగుతున్న ప్రాంతాన్ని తనిఖీ చేశారు. ఈ క్రమంలో మైనింగ్ వివరాలు నమోదు చేస్తున్న వ్యక్తి పరారయ్యాడు. ఘటనా స్థలంలో ద్విచక్రవాహనాన్ని, ఎక్స్కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నారాయణాద్రిలో అరుదైన డెలివరీ


మీడియాతో మాట్లాడుతున్న వైద్యులు

తిరుపతి తుడా : ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో ఓ మహిళకు క్లిష్టమైన కాన్పును విజయవంతంగా పూర్తి చేశారు. మంగళవారం ఈ మేరకు గైనకాలజిస్ట్ డాక్టర్ ఆర్.సృజన మీడియాతో మాట్లాడుతూ 44 ఏళ్ల మహిళ రక్తం గడ్డ కట్టడం, బీపీ ఎక్కువ ఉండడం వంటి సమస్యలతో బాధపడుతూ తమ ఆస్పత్రిని ఆశ్రయించిందన్నారు. నిపుణుల సహకారంతో క్లిష్టమైన కేసును గట్టెక్కించామని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వెల్లడించారు. ఈ క్రమంలో తమ ఆస్పత్రిలో కంప్లీట్ టీమ్ ఉందని, రూ.4,999 ప్యాకేజీతో ప్రెగ్నెన్సీ నుంచి డెలివరీ వరకు సేవలు అందిస్తున్నామని వివరించారు. అదనంగా రూ. 44వేల ప్యాకేజీతో డెలివరీ సైతం చేస్తున్నామని చెప్పారు. అరుదైన డెలివరీ చేసిన వైద్య బందానికి అభినందనలు తెలిపారు. సమావేశంలో డాక్టర్ లతీష్ కుమార్ రెడ్డి, డాక్టర్ సునంద కుమార్‌రెడ్డి, శ్రీధర్ ముని, డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్, డాక్టర్ అనంత్‌పోజాల, డాక్టర్ ప్రతిమ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాల తనిఖీలో పోలీసులు

తిరుపతి రూరల్ : మండలంలోని తనపల్లె నుంచి వేదాంతపురం అగ్రహారం జంక్షన్ వరకు మంగళవారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ కింద వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన రికార్డులు లేనటువంటి 19 ద్విచక్ర వాహనాలు, 1 ట్రాక్టర్, 1 కారు, 1 ఆటోను సీజ్ చేసినట్టు ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి తెలిపారు. అలాగే వాహనదారులకు కొత్త మోటర్ వెహికల్ చట్టంపై అవగాహన కల్పించారు.

వైన్‌షాప్ వద్దని ఆందోళన


ధర్నా నిర్వహిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : సాయినగర్ పంచాయతీలో వైన్ షాప్ ఏర్పాటు చేయవద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ధర్నా చేపట్టారు. మద్యం షాపు ఆలోచన విరమించే వరకు పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతలు పెంచలయ్య, విశ్వనాథ్, ఎస్.శ్రీరాములు, రామకృష్ణ, పద్మనాభంరెడ్డి, నాగరాజు, రత్నమ్మ, ప్రమీల, కామాక్షి పాల్గొన్నారు.

పోరాటం



కామన్ పీజీ సెట్ రద్దు చేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. మంగళవారం ఈ మేరకు చేపట్టిన వర్సిటీలు, డిగ్రీ కళాశాలల బంద్ విజయవంతమైంది. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని విస్మరించిన మంత్రి లోకేష్ వ్యవహారశైలిపై విద్యార్థిలోకం మండిపడింది. కూటమి ప్రభుత్వ విధానం కారణంగా విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్లు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఆయా వర్సిటీల్లోనే పీజీ సెట్ నిర్వహించుకునేలా చర్యలు తీసుకోకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించింది. కార్యక్రమంలో నేతలు సుందరరాజు, శివారెడ్డి, బండి చలపతి, రవి, అక్బర్, మల్లికార్జున, ప్రవీణ్, ఉదయ్, అశోక్, చిన్న, ఆషా, చంద్రశేఖర్ నాయక్, తిరుమలేష్, యోగేశ్వర, మహేంద్ర నాయక్, వినోద్, వేణు, ఓమ్ రాజ్, చంద్ర నాయక్, శివతోపాటు విద్యార్థుల ఐక్యవేదిక కదంతొక్కింది.

– తిరుపతి సిటీ

పరిపూర్ణం



జాతీయ సంస్కృత వర్సిటీలో శక్తివిశిష్టాద్వైతం అనే అంశంపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు మంగళవారంతో పరిపూర్ణమైంది. ముఖ్యఅతిథిగా కాశీపీఠం శ్రీమద్ కాశీ జ్ఞానసింహాసనాధీశులు జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్యులు హాజరయ్యారు. శక్తి విశిష్టాద్వైత కేంద్రాన్ని వర్సిటీ ఏర్పాటు చేయడం సంతోషకరమని, విద్యార్థులకు శాస్త్ర అధ్యయనానికి ఎంతో ఉపకరిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో బెనారస్ హిందూ వర్సిటీ ప్రొఫెసర్ రాజారాం శుక్లా, రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, ప్రొఫెసర్ గణేష్ భట్, శివరామ దాయగుడే, మనోజ్‌షిండే పాల్గొన్నారు.

– తిరుపతి సిటీ

ప్రమాదకరం



తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి నిత్యం సుమారు 1.2 లక్షల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇదే ప్రాంగణంలోని శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లెవెలుగు బస్టాండ్ల ద్వారా వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. అసలే అరకొర వసతులతో ప్రజలు ఇబ్బందిపడుతుంటారు. అది చాలదన్నట్టు శ్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో ప్రయాణికులు హడలిపోతున్నారు. ఎప్పుడు ఎవరి తలపగులుతుందో అని భయాందోళన చెందుతున్నారు. అయితే ఆర్టీసీ సిబ్బంది మాత్రం కంచె ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థలోని శ్లాబ్‌కు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

– తిరుపతి అర్బన్

ఆశల దారిని ఆపేశారు!


అసంపూర్తిగా శెట్టిపల్లి మాస్టర్ ప్లాన్ రోడ్డు

తిరుపతికి కనెక్టవిటీ పెంచాలి.. నగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టాలి.. రహదారులను విస్తరించాలి.. శ్రీవారి భక్తులు సులువుగా రాకపోకలు సాగించాలి.. శివారు ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించాలి.. ఇదే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రణాళిక రూపొందించారు. నాటి డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి చొరవతో మాస్టర్ ప్లాన్ రోడ్లకు శ్రీకారం చుట్టారు. యుద్ధప్రాతిపదికన సువిశాలమైన రహదారులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే టీటీడీ సహకారంతో శెట్టిపల్లి రోడ్డు పనులను ప్రారంభించారు. ఇంతలో సర్కారు మారడంతో నిర్మాణం ఆగిపోయింది. స్థానికులు ఆశగా ఎదురుచూసిన దారి అసంపూర్తిగా మిగిలిపోయింది. చివరకు కాంట్రాక్టర్ సైతం చేతులెత్తేసి వెళ్లిపోయే దుస్థితి దాపురించింది.

- శెట్టిపల్లె రోడ్డు నిర్మాణం ఇక లేనట్టే..
- ఆగుతూ.. సాగుతూ.. అసంపూర్తిగా మిగిలింది
- రాజకీయాల కారణంగా నిలిచిపోయిన పనులు
- ప్రజావసరాలను పట్టించుకోని పాలకులు
- నిధులు మంజూరు చేయని టీటీడీ అధికారులు

తిరుపతి మంగళం : నగర శివారు ప్రాంతాలను రేణిగుంట, తిరుచానూరు రైల్వే స్టేషన్లను అనుసంధానం చేస్తూ టీటీడీ సహకారంతో నిర్మించ తలపెట్టిన మంగళం శెట్టిపల్లె రోడ్డు నిర్మాణానికి తొలి నుంచీ అడ్డంకులు ఏర్పడుతున్నాయి. అటు రేణిగుంట- తిరుపతి ప్రధాన మార్గ, ఇటు కరకంబాడి-తిరుపతి రహదారిని కలుపుతూ, నారాయణాద్రి ఆస్పత్రి మీదుగా తిరుచానూరుకు భక్తులు సులువుగా చేరుకోవడానికి వీలుగా రోడ్డు నిర్మించేందుకు 2023 నవంబరులో టీటీడీ అప్పటి చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో పాలకమండలి ఆమోదం తెలిపింది. ఈనేపథ్యంలోనే సర్వేలను పూర్తి చేసి రూ.15.12 కోట్ల వ్యయంతో 80 అడుగుల వెడల్పుతో సుమారు 8కిలోమీటర్ల నాలుగు లేన్ల రహదారిని అభివృద్ధి చేసేలా 2024 జనవరిలో పనులను ప్రారంభించారు. అయితే రోడ్డు నిర్మాణం ప్రారంభమైన రోజు నుంచీ వరుసగా అడ్డంకులే ఎదురవుతున్నాయి. తొలిదశలో తిరుపతి-కరకంబాడి మార్గంలో మంగళం ఆర్టీఏ కూడలి నుంచి శెట్టిపల్లె రైల్వే గేటు వరకు పనులు చేపట్టగా తెలుగు గంగ పైపులు అడ్డుగా వచ్చాయి. సరిగ్గా రోడ్డుకు దిగువభాగంలో పైపులు ఉండడంతో రోడ్డు నిర్మాణం పనులకు బ్రేకులు పడ్డాయి. అదే సమయంలో రేణిగుంట- తిరుపతి ప్రధాన మార్గం నుంచి నారాయణాద్రి ఆస్పత్రి మీదుగా తిరుచానూరు వైపు నిర్ణయించిన మార్గం పనులను పూర్తి చేసేశారు. ఆపై శెట్టిపల్లె మార్గం పనులను టీటీడీ అధికారులు కొన్ని మార్పులతో ప్రారంభించినా, కల్వర్టుల నిర్మాణం, విద్యుత్ స్తంభాల తొలగింపును సాకుగా చూపి పనులను మళ్లీ ఆపేశారు. తాజాగా నాలుగు నెలల క్రితం సెప్టెంబరులో కాంట్రాక్టర్ మరోమారు పనులను ప్రారంభించినా తెలుగు గంగ పైప్‌లైన్ల తొలగింపు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల కారణంగా పదిరోజులకే మళ్లీ పనులు నిలిచిపోయాయి.

చొరవ చూపని టీటీడీ

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత శెట్టిపల్లె రోడ్డు పనులపై రాజకీయ నీడలు కమ్ముకున్నాయి. భూమన కరుణాకరరెడ్డి శ్రీకారం చుట్టారనే సాకుతో పనులను పూర్తి చేసేందుకు ప్రస్తుత పాలకులు ఆసక్తి చూపడం లేదు. కనీసం ప్రజలు, శ్రీవారి భక్తులకు ఉపయోగపడుతుందనే కోణంలో కూడా ఆలోచించేందుకు ఇష్టపడడం లేదు. ఈ క్రమంలో టీటీడీ అధికారులు సైతం నిధుల విడుదలకు చొరవ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విజిలెన్స్ విచారణ పేరుతో నిధుల కేటాయింపునకు నిరాకరిస్తున్నట్లు సమాచారం. దీంతో ఎంతో ప్రాధాన్యత గల ఈ రోడ్డు పనుల్లో ఎలాంటి పురోగతి లేకుండా.. ఎక్కడివేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోయింది. చివరకు రోడ్డు నిర్మాణం ప్రశ్నార్థకంగా మారిపోయింది.

నోటీస్ బోర్డు

• పుస్తకోత్సవం

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో మూడురోజులుగా నిర్వహిస్తున్న పుస్తకోత్సవం బుధవారంతో ముగియనుంది. 50 విభాగాలకు సంబంధించిన అకడమిక్ విద్యకు ఉపయోగపడే సుమారు 20వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నట్టు సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేంద్రబాబు తెలిపారు. 20 నుంచి 30 శాతం రాయితీతో పుస్తకాలను విక్రయిస్తున్నట్లు వివరించారు.

• చెరువుల వేలం రేపు

పాకాల : దామలచెరువు పంచాయతీ పరిధిలోని చెరువులకు గురువారం వేలం నిర్వహించనున్నట్లు ఈఓ మహేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మొరవపల్లి నాయని చెరువు, పత్తిపాటివారిపల్లి కమ్మ వెంకటాయని చెరువు, కుక్కలపల్లి లింగనచెరువు, ఊటువంక ఓబయ్య చెరువు, జింకలమిట్ట వీరయ్యకుంట, బందార్లపల్లె చెరువు, పచ్చిపాల యల్లప్పకుంట, మేడసానికుంట, కొత్తచెరువు, తిమ్మప్పనాయనికుంట, చిట్టిమనాయని చెరువు, వెంకటకృష్ణారెడ్డి చెరువు, కామాక్షమ్మ చెరువుల లీజు హక్కులకు వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. నిర్దేశిత కాలపరిమితితో చెరువుల్లో చేపపిల్లలను వదులుకుని, పట్టుకునేందుకు అవకాశముంటుందని వెల్లడించారు. ఆసక్తిగలవారు పంచాయతీ నిర్ణయించిన రుసుమును డిపాజిట్ కింద ముందస్తుగా చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు


క్యారమ్స్ ఆడుతున్న టీటీడీ మహిళా ఉద్యోగులు

తిరుపతి కల్చరల్ : టీటీడీ ఉద్యోగులకు నిర్వహిస్తున్న క్రీడాపోటీలు మంగళవారం హోరాహోరీగా సాగాయి. మహిళా అధికారుల టెన్నికాయిట్ సింగిల్స్‌లో కుమారి దేవి విన్నర్‌గా, దామర సెల్వి రన్నరప్‌గా నిలిచారు. డబుల్స్‌లో కుమారి దేవి, దామర సెల్వి విజయం సాధించగా, రమాదేవి, నారాయణమ్మ రన్నరప్‌గా నిలిచారు. అలాగే పురుష ఉద్యోగుల బాల్ బ్యాడ్మింటన్‌లో సుభాష్ చంద్రబోస్ విజేతగా మహేష్ రన్నరప్‌గా నిలిచారు. ప్రత్యేక ప్రతిభావంతుల పురుష ఉద్యోగుల బాల్ బ్యాడ్మింటన్‌లో బాబు విజేతగా నిలవగా, మధుసూదన్ శర్మ రన్నర్‌గా నిలిచారు. ప్రత్యేక ప్రతిభావంతుల మహిళా ఉద్యోగుల పోటీలలో గౌరీ విజయం సాధించగా, కుమారి రన్నర్‌గా నిలిచారు. అలాగే మహిళా ఉద్యోగుల క్యారమ్స్ సింగిల్స్‌లో స్వప్న మంజరి విజయం సాధించగా, సుధారాణి రన్నర్‌గా నిలిచారు. క్యారమ్స్ డబుల్స్‌లో సులోచన రాణి, స్వప్నకుమారి విజేతలుగా, రాజేశ్వరి, సుధారాణి రన్నర్‌గా నిలిచారు. డాడ్ జీ బాల్ పోటీలో మనోజ విజయం సాధించగా, గంగాదేవి రన్నర్‌గా నిలిచారు.

హామీలు నెరవేర్చకుంటే పోరాటం


నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

తిరుపతి కల్చరల్ : ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే పోరాటానికి దిగుతామని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి హెచ్చరించారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆటో కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డుతోపాటు పలు హామీలను కూటమి నేతలు గుప్పించారని, అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నారని మండిపడ్డారు. మాట నిలబెట్టుకోకుంటే గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతలు పురుషోత్తంరెడ్డి, సురేష్, వెంకటేష్, కృష్ణ, భూపాల బాల, పార్వతి, భాస్కార్, కాశీ, లక్ష్మణ్, నవీన్, శంకరయ్య పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులకు డిమాండ్


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నేతలు, వీధి వ్యాపారులు

తిరుపతి కల్చరల్ : వీధి వ్యాపారులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. మంగళవారం బైరాగిపట్టెడలోని సీపీఐ కల్యాణ మండపంలో వీధి వ్యాపారుల సంఘం జిల్లా రెండో మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సర్కిల్ నుంచి ఎయిర్ బైపాస్ రోడ్డు మీదుగా ర్యాలీ చేపట్టారు. పతాకావిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారుల రక్షణకు ప్రవేశపెట్టిన చట్టాలను అధికారులు అమలు చేయడం లేదని ఆరోపించారు. జిల్లాలో 30 వేల మందికిపైగా వీధి వ్యాపారులను గుర్తించామని అధికారులు లెక్కలు చెబుతున్నప్పటికీ, ఎందరికి గుర్తింపుకార్డులు మంజూరు చేశారో వెల్లడించాలని కోరారు. రాజకీయ నేతలు యథేచ్ఛగా చిరువ్యాపారులను వేధిస్తూ మామూళ్ల వసూలు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివకుమార్, రాష్ట్ర కార్యదర్శి టి. వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా నేతలు రాధాకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌డీ రవి, శ్రీరాములు, శివ, వీధి వర్తక వ్యాపార సంఘం నేతలు మునీంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

• విజయోత్సాహం


స్వీట్లు పంచిపెడుతున్న క్రీడాభిమానులు

తిరుపతి క్రైమ్ : చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్ లో ఆస్ట్రేలియాపై భారత్ ఘన విజయం సాధించడంతో తిరుపతిలో సంబరాలు మిన్నంటాయి. మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్, నాయకులు పాటిబండ మురళి రాజశేఖర్ రెడ్డి, జయంత్ కుమార్ తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, మల్లారపు రవి, ప్రసాద్, ఉపాధ్యాయులు తిరుమలయ్య, కృష్ణారావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక వికాసం

- ఎస్వీయూ లైబ్రరీలో పుస్తకమహోత్సవం
- అందుబాటులో ఆధునిక సిలబస్
- 20 వేల బుక్స్‌తో అద్భుత ప్రదర్శన



నూతన విద్యావిధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావాలి. రాయితీపై ప్రతి ఒక్కరికీ అందించాలి. ఇదే లక్ష్యంతో ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. దేశంలోని ప్రధాన నగరాలకు చెందిన పబ్లిషర్లతో స్టాల్స్ ఏర్పాటు చేయించారు. అద్భుత గ్రంథాలతోపాటు తెలుగు సాహిత్య మధురిమలను పంచే విశిష్ట పుస్తకాలను 20 నుంచి 30 శాతం రాయితీపై విక్రయిస్తున్నారు. బుధవారం వరకు కొనసాగనున్న ఈ మహోత్సవానికి పెద్దసంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజలు తరలివస్తున్నారు. ఆసక్తిగా ఎగ్జిబిషన్ తిలకిస్తూ అవసరమైన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు.

– తిరుపతి సిటీ

ఉపయోగకరం



లైబ్రరీ ఆధ్వర్యంలో పుస్తక పదర్శన ఏర్పాటు చేయడం సంతోషకరం, ఇందులో అన్ని రకాల పుస్తకాలు లభిస్తున్నాయి. అధునాత సమాచారం, నూతన సిలబస్‌కు తగ్గట్టు పలు రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. మాలాంటి పరిశోధక విద్యార్థులకు పుస్తకోత్సవం ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– నరేష్, పరిశోధక విద్యార్థి, ఎస్వీయూ

నూతన ప్రాజెక్టులకు అవసరం



నూతన విద్యావిధానం ప్రవేశపెట్టిన తర్వాత సిలబస్‌లో తేడా వచ్చింది. అందుకు అనుగుణంగా విద్యార్థులు సిద్ధమయ్యేందుకు ఇలాంటి ప్రదర్శన ఎంతో ఉపకరిస్తుంది. పలువురు నిపుణులు, రచయితల గ్రంథాలను పుస్తకోత్సవంలో ఉంచారు. ప్రపంచీకరణ నేపథ్యంలో నూతన ప్రాజెక్టులకు అవసరం.

– సౌభాగ్యరాణి,విక్టోరియా, అధ్యాపకులు, ఎస్వీయూ

సంతోషంగా ఉంది



సుమారు 50విభాగాలకు అవసరమైన నూతన సిలబస్‌తో కూడిన పుస్తకాలను విద్యార్థులకు, అధ్యాపకులుకు అందుబాటు ఉంచాం. పలు రాష్ట్రాల నుంచి సుమారు 20వేలకుపైగా విభిన్న రచయితల పుస్తకాలను తెప్పించాం. విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజలు వస్తున్నారు. స్పందన చూస్తుంటే సంతోషంగా ఉంది.

– సురేంద్రబాబు, సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్, ఎస్వీయూ

పరిశుభ్రతతోనే ప్రత్యేక గుర్తింపు


మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగర పరిశుభ్రతతోనే ప్రత్యేక గుర్తింపు వస్తుందని, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తిరుపతికి ఉన్నత స్థానం సాధించేందుకు ప్రజలు, అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేయాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పిలుపునిచ్చారు. మంగళవారం మహతి ఆడిటోరియంలో నగరంలో పచ్చదనం- పారిశుద్ధ్యం, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు రూపొందించాల్సిన ప్రణాళికలపై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలతో మమేకమై మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తే మరిన్ని ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యంతోపాటు కుటుంబాలను వదిలి పెట్టి పనులు చేస్తున్నారని చెప్పారు. ప్రజలతోపాటు పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. అందుకే ప్రత్యేక రక్షణ కవచాలు అందించామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి కార్మికుడికీ బీమా సౌకర్యం కల్పించామని, ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నామని వివరించారు. ఎలాంటి సమస్యలైనా తనను నేరుగా కలవచ్చని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు ప్రతి రోజూ విధులకు హాజరై ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. అధికారులు కింది స్థాయి సిబ్బందితో కలసి మెలసి పనిచేయాలని స్పష్టం చేశారు.

కేబుల్స్ సరిచేయండి

నగరంలో అడ్డదిడ్డంగా ఉంటూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న కేబుళ్లను వారంలోపు సరిచేసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో స్థానిక కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు, యాడ్ ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అస్తవ్యస్తంగా కేబుల్స్ ఉన్నాయని, దీంతో వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. రోడ్డుకి ఇరువైపులా స్తంభాలకు పద్నాలుగు అడుగుల ఎత్తులో కేబుళ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాడ్ ఏజెన్సీల వారు డబ్బులు చెల్లించకుండా హోర్డింగులు పెడితే తొలగిస్తామని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనాలు తొలగించండి

తిరుపతి సిటీ : మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఫ్రీ లెఫ్ట్‌ల వద్ద అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో వచ్చిన వినతుల మేరకు 41, 35 వార్డుల్లో ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్లపై వాహనాలను నెలల తరబడి పార్కింగ్ చేయడం వలన రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన మట్టిని జేసీబీల సాయంతో తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమాల్లో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీఈలు మధు, రమణ, శిల్ప, ఏసీపీ మూర్తి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.